మంగళవారం

02-7-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 382, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## కొత్త చట్టాలను బలవంతంగా అమల్లోకి తెచ్చారు


146 మంది ఎంపీలను బయటికి పంపి ఆమోదించారు

కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శలు



ముందడుగు ఢిల్లీ:

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నేర న్యాయ చట్టాలు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్(సీఆర్‌పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ మిగతా 2లో




## నూతన చట్టాలతో సత్వర న్యాయం

- జాప్యాలకు చెల్లుచీటీ, విచారణ వేగవంతం
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

ముందడుగు ఢిల్లీ:

దేశంలో నూతన నేర న్యాయ చట్టాల అమలు సందర్భంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడారు. స్వాతంత్రం సిద్ధించిన 77 ఏండ్ల తర్వాత మన నేర న్యాయ వ్యవస్థ పూర్తిగా స్వదేశీగా మారిందని, ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నానని అన్నారు. భారతీయ విలువల ఆధారంగా నూతన చట్టాలు పనిచేస్తాయని చెప్పుకొచ్చారు. వలసవాద చట్టాలకు పాతరేసి భారత పార్లమెంట్‌లో రూపొందిన చట్టాలు అమల్లోకి వచ్చాయని చెప్పారు.
దండనకు బదులు ఇప్పుడు న్యాయం అందుబాటులోకి వచ్చిందని వ్యాఖ్యానించారు. నూతన చట్టాల అమలుతో జాప్యాలకు చెల్లుచీటీ సాధ్యమై విచారణ వేగవంతమై సత్వర న్యాయం అందుబాటులోకి వస్తుందని అన్నారు. గత చట్టాల హయాంలో కేవలం పోలీసుల హక్కులే కాపాడబడేవని, నూతన చట్టాల రాకతో బాధితులు, ఫిర్యాదుదారుల హక్కుల పరిరక్షణకు వెసులుబాటు ఏర్పడిందని చెప్పారు. ఈ క్రమంలో నూతన చట్టాల కింద దేశ రాజధాని ఢిల్లీలో తొలి కేసు నమోదయింది.



### ఫోన్ పే, పేటీఎంపై కరెంట్ బిల్లులు చెల్లవు

వివరాలు 3లో



### ఇంకా బ్యాంకులకు చేరని రూ.2000 నోట్లు

వివరాలు 3లో



### యుద్ధంలో చేరితే జైలు నుంచి విడుదల చేస్తాం

వివరాలు 3లో



### ఎప్పటికి ఉత్సాహంగా ఉండాలా..!

వివరాలు 4లో

## ఢిల్లీ హైకోర్టులో కవితకు నిరాశే

- రెండు బెయిల్ పిటిషన్లు తిరస్కరణ
- జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కవిత

ముందడుగు ఢిల్లీ

ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఢిల్లీ హైకోర్టులో నిరాశ ఎదురైంది. ఆమె బెయిల్ కోరుతూ దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లను ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. సీబీఐ, ఈడీ తనపై నమోదు చేసిన కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలంటూ ఆమె ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. మద్యం కేసులో ప్రమేయం ఉందన్న ఆరోపణలతో మార్చి మిగతా 2లో





## గవర్నర్‌తో రేవంత్ రెడ్డి భేటీ

నామినేటెడ్ ఎమ్మెల్సీల అంశాలపై చర్చ

ముందడుగు హైదరాబాద్:

తెలంగాణ రాజ్‌భవన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న వివిధ బిల్లులపై గవర్నర్‌తో చర్చించారు. ఈ భేటీలో అసెంబ్లీ సమావేశాలు, నామినేటెడ్ ఎమ్మెల్సీల అంశం చర్చకు వచ్చాయి. బిల్లులు, మంత్రివర్గ విస్తరణపై గవర్నర్, సీఎం చర్చించినట్లు సమాచారం. రేవంత్‌రెడ్డి వెంట ఆయన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు.

ముందడుగు
మంగళవారం, 02-7-2024, హైదరాబాద్

# కొత్త చట్టాలను బలవంతంగా అమల్లోకి తెచ్చారు

మొదటిపేజీ తరువాయి

సాక్ష్య అధినియం (బీఎస్) చట్టాలను తీసుకువచ్చారు. ఈ కొత్త చట్టాలను కేంద్ర ప్రభుత్వం బలవంతంగా అమల్లోకి తెచ్చిందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

పార్లమెంట్ ఉభయ సభల్లో 146 మంది ప్రతిపక్ష ఎంపీలను బయటకు పంపించి, బలవంతంగా కొత్త నేర చట్టాలకు సంబంధించిన బిల్లులను పాస్ చేశారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'ఎన్నికల్లో నైతికంగా ఎదురుదెబ్బ తగిలిన తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ రాజ్యాంగానికి విలువ ఇస్తున్నట్లు నటిస్తున్నారు. కానీ, నిజం ఏంటంటే.. ఈ రోజు నుంచి అమల్లోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలను 146 మంది



ఎంపీలను బలవంతంగా సస్పెండ్ చేసి ఆమోదించారు. భారత పార్లమెంటరీ వ్యవస్థపై ఈ 'బుల్డోజర్ న్యాయం' ఆధిపత్యాన్ని ఇండియా కూటమి ఇకపై అనుమతించబోదు' అని ఖర్గే పేర్కొన్నారు.

# కేసీఆర్ పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు

- కమిషన్ ఛైర్మన్ ఎక్కడ చట్టాన్ని ఉల్లంఘించలే
- విచారణను కొనసాగించొచ్చంటూ స్పష్టం

ముందడుగు హైదరాబాద్:

బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. విద్యుత్ కమిషన్‌ను రద్దు చేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు సీజే ధర్మాసనం కొట్టేసింది. విద్యుత్ కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తోందంటూ కేసీఆర్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈక్రమంలో ఆయన తరపు న్యాయవాదుల వాదనతో హైకోర్టు విభేదించింది. మరోవైపు నిబంధనల మేరకే విద్యుత్ కమిషన్ వ్యవహరిస్తోందని అడ్వొకేట్ జనరల్(ఏజీ) తెలిపారు. కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని చెప్పారు. ఏజీ వాదనలను హైకోర్టు సమర్థించింది. విద్యుత్ కమిషన్ విచారణను



కొనసాగించొచ్చంటూ స్పష్టం చేసింది. జస్టిస్ నరసింహారెడ్డి పక్షపాతంగా వ్యవహరిస్తున్నా రనడానికి ఎలాంటి ఆధారాలు లేవని వాదనల సందర్భంగా హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. విద్యుత్ కమిషన్ ఛైర్మన్ ముందే ఓ నిర్ణయానికి వచ్చినట్లు ఆధారాలు లేవని చెప్పింది. కేవలం విలేకర్ల సమావేశం నిర్వహించారనే కారణంతో జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి పక్షపాత ధోరణితో వ్యవహరించారని అంటున్నారన్నారు. అనుమానించడం కాదని, దానికి తగిన ఆధారాలు చూపించాలని హైకోర్టు కోరింది.

జస్టిస్ ఎల్.నరసింహారెడ్డిపై చేసిన ఆరోపణలను నిరూపించడంలో కేసీఆర్ విఫలమయ్యారని పేర్కొంది. కేసీఆర్‌కు జారీ చేసిన నోటీసుల్లో కమిషన్ ఛైర్మన్ ఎక్కడా చట్టాన్ని ఉల్లంఘించలేదంది. విద్యుత్ కొనుగోళ్లు, పవర్ ప్లాంట్ల నిర్మాణం గురించి తెలుసుకోవడానికే ఆయనకు నోటీసులు జారీ చేశారని స్పష్టం చేసింది. ఇవన్నీ పరిశీలించిన తర్వాత పిటిషన్‌కు విచారణార్హత లేదని తేల్చినట్లు హైకోర్టు ధర్మాసనం వెల్లడించింది.

# ఢిల్లీ హై కోర్టులో కవితకు నిరాశే




మొదటిపేజీ తరువాయి

15న ఈడీ అధికారులు కవితను అరెస్టు చేసి ఢిల్లీకి తరలించిన విషయం తెలిసిందే. వారం రోజుల ఈడీ కస్టడీ అనంతరం జ్యుడీషియల్ కస్టడీకి తరలించాక.. ఏప్రిల్‌లో విచారణ సందర్భంగా సీబీఐ రెండు రోజుల పాటు తమ కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించింది. ఆ తర్వాత ఆమెను అరెస్టు చేసినట్లు ప్రకటించింది. తర్వాత ఆమెను కోర్టులో హాజరు పరచగా.. 14 రోజులు రిమాండ్ విధిస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం కవిత జ్యుడీషియల్ కస్టడీలో ఉంటున్నారు.

ఢిల్లీ మద్యం కేసు కీలక దశలో కొనసాగుతున్న తరుణంలో ఆమెకు బెయిల్ మంజూరు చేస్తే సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశం ఉందని వాదించారు. అందువల్ల ఎట్టిపరిస్థితుల్లో ఆమెకు బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు. సీబీఐ, ఈడీ వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న కోర్టు కవిత పిటిషన్లను తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

# కొత్త చట్టాల కింద తెలంగాణలో తొలి కేసు

## నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనదారుడిపై ఎఫ్ఐఆర్

ముందడుగు హైదరాబాద్:

దేశ వ్యాప్తంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చిన కొత్త నేర, న్యాయ చట్టాల కింద తెలంగాణలో తొలి కేసు నమోదైంది. చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలో నెంబర్ ప్లేట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్త చట్టాల ప్రకారం సెక్షన్ 281 బీఎన్ఎస్, ఎంవీ యాక్ట్ కింద ఎఫ్ఐఆర్‌ను డిజిటల్‌గా నమోదు చేశారు.

దేశంలో బ్రిటిష్ వలస పాలన నుంచి కొనసాగుతున్న భారత శిక్షా స్మృతి(ఐపీసీ), నేర శిక్షాస్మృతి (సీఆర్పీసీ), భారత సాక్ష్యాధార చట్టం స్థానంలో గతేడాది పార్లమెంటు ఆమోదించిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య



అధినియమ్(బీఎస్ఏ) ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. జీరో ఎఫ్ఐఆర్, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు, ఎస్సెమ్మెస్ లాంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలతో సమన్ల జారీ లాంటి అత్యాధునిక పద్ధతులు కొత్త చట్టాలతో న్యాయవ్యవస్థలోకి ప్రవేశిస్తున్నాయి.

# ఆర్మీకి నాయకత్వం వహించడం గర్వకారణం

- ఏలాంటి సవాళ్లనైనా స్వీకరించడానికి సైన్యం సిద్ధం
- ఆర్మీ నూతన చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది

ముందడుగు జాతీయం:

దేశ భద్రతకు సంబంధించి ఏలాంటి సవాళ్లనైనా స్వీకరించడానికి సైన్యం సిద్ధంగా ఉందని ఆర్మీ నూతన చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. తూర్పు లద్దాఖ్‌లో సరిహద్దు వివాదాన్ని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. భారత ఆర్మీకి ఆయన నిన్న చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. తాను పదాతి దళం, వాయుసేన, నేవీతో కలిసి సినర్జీని పెంచుతానని వెల్లడించారు. నేడు ఆర్మీ చీఫ్ రైసినా హిల్స్‌లోని సౌత్ బ్లాక్‌లో గార్డ్ ఆఫ్ హానర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "సైన్యం ప్రత్యేకమైన ఆపరేషనల్ సవాళ్లను ఎదుర్కొం టోంది. పలు ముప్పలను ఢీకొన డానికి సిద్ధంగా ఉన్నాం. నాకు అప్పజెప్పిన బాధ్యతలపై పూర్తి అవ గాహనతో ఉన్నాను. దేశ ఆర్మీకి నాయకత్వం వహించడం గర్వకారణం" అని పేర్కొన్నారు.



సైనిక దళాల్లో దేశీయ ఆయుధాలను ప్రవేశపెట్టేందుకు పూర్తి సానుకూలతతో ఉన్నట్లు వెల్లడించారు. భౌగోళిక రాజకీయాలు, సాంకేతికత వేగంగా మారిపోతున్నాయని ద్వివేది అభిప్రాయపడ్డారు. వికసిత్ భారత్-2047 విజన్ సాధించేందుకు వీలుగా జాతినిర్మాణం కోసం పనిచేస్తామన్నారు. భారత్ ప్రయోజనాలు కాపాడేందుకు కృషి చేస్తామన్నారు. ఇక సిబ్బంది, వారి కుటుంబాలకు పూర్తి మద్దతు ఇస్తామని పేర్కొన్నారు.

ముందడుగు
మంగళవారం, 02-7-2024, హైదరాబాద్

# ఎస్పీ ఆఫీసు ముందే భార్యను చంపిన కానిస్టేబుల్

## భార్యాభర్తల మధ్య భూవివాదమే కారణమని వెల్లడి

ముందడుగు కర్ణాటక:

ప్రజలకు రక్షణ కల్పించాల్సిన కానిస్టేబుల్ జిల్లా ఎస్పీ కార్యాలయం ముందే తన భార్యను దారుణంగా పొడిచి చంపిన సంఘటన కర్ణాటక రాష్ట్రం హసన్ జిల్లాలో జరిగింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లోక్‌నాథ్ అనే వ్యక్తి హసన్ జిల్లాలోని హసన్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. గత కొన్నాళ్లుగా ఓ భూమికి సంబంధించిన విషయంలో లోక్‌నాథ్‌కు ఆయన భార్య మమతకు మధ్య గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో మమతను లోక్‌నాథ్ రోజూ కొట్టడం, తిట్టడం చేస్తున్నాడు.




ఈ నేపథ్యంలో లోక్‌నాథ్ తనను హింసిస్తున్నాడని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు మమత సోమవారం ఉదయం ఎస్పీ కార్యాలయానికి వెళ్లింది. దాంతో ఆమెను వెంబడించిన లోక్‌నాథ్ ఎస్పీ కార్యాలయం ముందే కత్తితో దారుణంగా పొడిచి చంపాడు. అక్కడే ఉన్న పోలీసులు హుటాహుటిన బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మరణించినట్లు ధృవీకరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఓ భూమికి సంబంధించి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని, అదే ఆమె హత్యకు కారణమని ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు.

# ఫోన్ పే, పేటీఎంపై కరెంట్ బిల్లులు చెల్లవు

- డిస్కమ్ మొబైల్ యాప్‌తో చెల్లించాలి
- తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సూచన

ముందడుగు తెలంగాణ:


విద్యుత్ బిల్లులు ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే వంటి థర్డ్ పార్టీ యాప్స్ వంటి వాటితో ఈ నెల నుంచి విద్యుత్ బిల్లుల చెల్లింపులు చేయడం సాధ్యపడదు. క్రెడిట్ కార్డు బిల్లు చెల్లింపుల తరహాలోనే ఆయా యాప్స్ ఈ సేవలనూ నిలిపి వేయడమే కారణం. ఈ నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తమ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌లోనే బిల్లుల చెల్లింపులు చేయాలని వినియోగదారులకు సూచించింది. ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి జులై 1 నుంచి ఆయా చెల్లింపు సంస్థలు TGSPDCL విద్యుత్ బిల్లులు చెల్లింపులను నిలిపివేశాయని ఎక్స్ ద్వారా తెలిపింది. ఒక్క దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థే కాదు.. తెలుగు



రాష్ట్రాల్లోని ఇతర డిస్కమ్‌లదీ అదే పరిస్థితి. TGNPDCL, APSPDCL, APEPDCL, APCPDCL పరిధిలోని బిల్లులు చెల్లించాలని ప్రయత్నించినప్పుడు భారత్ బిల్లు పేమెంట్ సిస్టమ్‌కు రిజిస్టర్ కాలేదని చూపిస్తోంది. దీనివల్ల పెద్ద సంఖ్యలో వినియోగదారులపై ప్రభావం పడనుంది. దీంతో ఆయా విద్యుత్ పంపిణీ సంస్థల పరిధిలోని విని యోగదారులు డిస్కమ్ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌ను ఆశ్రయించాల్సిందే.

# యుద్ధంలో చేరితే జైలు నుంచి విడుదల చేస్తాం

## ఖైదీలకు ఉక్రెయిన్ ఆర్మీ ఆఫర్



ముందడుగు ఉక్రెయిన్:

ఉక్రెయిన్ ప్రభుత్వం తొలిసారిగా జైల్లోని ఖైదీలనూ మిలటరీలోకి తీసుకునేందుకు సిద్ధమైంది. ఇందుకోసం వారికి ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు చేస్తోంది. మాస్కోకు వ్యతిరేకంగా యుద్ధంలో చేరుతామనే వారిపై కేసులు కొట్టేసి జైలు నుంచి విడుదల చేస్తామని ఉక్రెయిన్ ఆర్మీ ఖైదీలకు ఆఫర్ ఇచ్చింది. "ఈ నిర్బంధ జీవితానికి ముగింపు పలకండి. కొత్త జీవితాన్ని ప్రారంభించండి. ఇందుకోసం మీరు చేయాల్సింది ఒకటే..! మీ మాతృభూమిని కాపాడుకునేందుకు ఫ్రంట్‌లైన్‌లో పోరాడాలి" అని ఆర్మీ రిక్రూటర్లు ఖైదీల్లో ప్రేరణ నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఖైదీలను విడుదల చేసి వారిని సైన్యంలో తీసుకునేందుకు ఉక్రెయిన్ గత నెల పార్లమెంట్‌లో ప్రత్యేక బిల్లును ఆమోదించింది. ఇప్పటికే 3000 మంది ఖైదీలను పైలట్ ప్రోగ్రామ్ కింద మిలిటరీ యూనిట్లలోకి తీసుకోగా.. ఇప్పుడు మరో 27 వేల మంది కోసం కొత్త రిక్రూట్‌మెంట్ ప్రోగ్రామ్‌ను చేపట్టింది. ఖైదీలకు పడిన శిక్షను సమీక్షించి.. వారి ఆరోగ్య స్థితిగతులను పరిశీలించిన తర్వాతే వారిని ఇంటర్వ్యూ చేస్తోంది. అత్యాచారం, హత్య వంటి కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న వారిని అనర్హులుగా ప్రకటించింది. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి ఆర్మీ క్యాంప్‌ల్లో సాధారణ శిక్షణ ఇవ్వనుంది. ఆయుధాలను ఎలా పట్టుకోవాలి.. యుద్ధ పరికరాలను ఎలా ఉపయోగించాలి అన్నది నేర్పించిన తర్వాత యుద్ధ విధుల్లోకి పంపించనుంది. ఈ ప్రోగ్రామ్‌కు ఖైదీల నుంచి మంచి స్పందన వస్తోంది.

# ఇంకా బ్యాంకులకు చేరని రూ.2000 నోట్లు

- ప్రజల వద్దే రూ.7,581 కోట్లు ఉన్నాయని వెల్లడి
- మార్పిడి అవకాశం ఉందన్న ఆర్బీఐ

ముందడుగు జాతీయం:

దేశంలో చెలామణిలో ఉన్న రూ.2000 నోట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తొలగించింది. అయితే రూ.2000 నోట్లలో 97.87 శాతం తిరిగి బ్యాంకులకు చేరినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించింది. అయితే రూ.7,581 కోట్ల విలువైన నోట్లు ఇప్పటికీ ప్రజల వద్ద ఉన్నాయని ఆర్బీఐ తన డేటాలో వెల్లడించింది. 2023 మే 19న చలామణిలో ఉన్న రూ. 2000 నోట్లను ఉపసంహరించుకోవాలని ఆర్‌బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. మే 19, 2023న వ్యాపారం ముగిసే సమయానికి చెలామణిలో ఉన్న రూ.2000 డినామినేషన్ బ్యాంకు నోట్ల మొత్తం విలువ రూ.3.56 లక్షల కోట్లు. జూన్ 28, 2024న వ్యాపారం ముగిసే సమయానికి



రూ.7,581 కోట్లకు తగ్గింది. రూ.2000 నోట్లలో 97.87 శాతం జూన్ 28, 2024 నాటికి బ్యాంకులకు తిరిగి వచ్చినట్లు సెంట్రల్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. దేశంలోని అన్ని బ్యాంకు శాఖలలో మార్పిడి సౌకర్యం అందుబాటులో ఉంది. మే 19, 2023 నుండి, రూ. 2000 బ్యాంకు నోట్లను మార్చుకునే సదుపాయం కూడా రిజర్వ్ బ్యాంక్ 19 ఇష్యూ కార్యాలయాల్లో అందుబాటులో ఉంది.

ముందడుగు
మంగళవారం, 02-7-2024, హైదరాబాద్

# స్పీకర్ గారు.. సభలో నన్ను చూడండి

## పాకిస్థాన్ మాజీ మంత్రి జర్తాజ్ గుల్ వ్యాఖ్యలు




ముందడుగు పాకిస్తాన్: పాకిస్థాన్ మాజీ మంత్రి జర్తాజ్ గుల్ పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీలో సమావేశాల్లో మాట్లాడుతున్నారు. ఆమె మాట్లాడుతున్నా స్పీకర్ సాధిక్ చూడకపోవడంతో జర్తాజ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నా పార్టీ నాకు ఇతరుల కళ్లల్లోకి సూటిగా చూస్తూ మాట్లాడటం నేర్పింది. నేను ప్రజల తరపున వచ్చిన నాయకురాలిని. 1,50,000 ఓట్లతో ఈ సభలో అడుగుపెట్టాను. నేను మాట్లాడుతున్నప్పుడు మీరు ఇలా నావైపు చూడకుండా ఉంటే మాట్లాడలేను. దయచేసి మీరు కళ్లజోడు పెట్టుకొని నాపైపు చూడండి'' అంటూ ఆమె స్పీకర్‌ను కోరారు. దీనికి స్పీకర్ హాస్యాస్పదంగా స్పందిస్తూ.. నేను మీ మాటలు వింటాను. కానీ మహిళల కళ్లల్లోకి సూటిగా చూస్తూ మాట్లాడటం మర్యాదగా అనిపించదు. అందుకే మిమ్మల్ని సూటిగా చూడట్లేదని అన్నారు. దీంతో సభలో నవ్వులు పూశాయి. అనంతరం జర్తాజ్ గుల్ మాట్లాడుతూ మహిళలను సూటిగా చూడకూడదని మీరు అనుకొని సభలో 52శాతం మహిళలను తొలగిస్తే మీరు ఎంపిక చేసిన వ్యక్తులు మాత్రమే సభలో పాల్గొంటారు అంటూ కౌంటర్ వేశారు. ఈ వీడియోను పాక్ మీడియా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో అదికాస్తా వైరల్‌గా మారింది.

# విమానంలో భారత సంతతి మహిళ మృతి

## తల్లిదండ్రులను చూడాలని స్వదేశానికి వస్తున్న కౌర్

ముందడుగు జాతీయం
భారత సంతతి మహిళ ఫ్లైట్ టేకాఫ్ కాక ముందే సీటు ముందు కుప్పకూలి మరణించింది. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఈ సంఘటన జరిగింది. పంజాబ్‌కు చెందిన 24 ఏళ్ల మన్‌ప్రీత్ కౌర్ ప్రసిద్ధ చెఫ్ కావాలని కలలు కన్నది. 2020 మార్చిలో ఆమె ఆస్ట్రేలియా చేరుకుంది. కుకరీ చదివిన తర్వాత ఆస్ట్రేలియా పోస్ట్‌లో పనిచేస్తున్నది. నాలుగేళ్ల తర్వాత భారత్‌లోని తల్లిదండ్రులను చూడాలని మన్‌ప్రీత్ కౌర్ భావించింది. ఆస్ట్రేలియాకు వచ్చిన తర్వాత తొలిసారి భారత్‌కు ప్రయాణమైంది. జూన్ 20న మెల్‌బోర్న్ నుంచి ఢిల్లీ వెళ్లే క్వాంటాస్ విమానంలోకి ఎక్కింది. ఆ తర్వాత సీటు బెల్టు పెట్టుకునేందుకు ఆమె ఇబ్బంది పడింది. అనంతరం కొన్ని



నిమిషాల్లోనే సీటు ముందు కుప్పకూలింది. టేకాఫ్‌కు ముందు ఆ విమానంలో చనిపోయింది. మరోవైపు క్షయవ్యాధి వల్ల మన్‌ప్రీత్ కౌర్ మరణించినట్లు ఆమె స్నేహితులు భావిస్తున్నారు. ఆమె అందరితో చాలా స్నేహంగా ఉంటుందని, కలిసి టూర్లకు వెళ్లినట్లు రూమ్‌మేట్లు గుర్తు చేసుకున్నారు. ఈ కష్ట సమయంలో కౌర్ కుటుంబానికి సహాయం కోసం 'గోఫండ్‌మి' ద్వారా నిధుల సేకరణ చేపట్టారు.



# ఎప్పటికి ఉత్సాహంగా ఉండాలా..!

- శరీరానికి ఇవి చాలా అవసరం
- వీటిని ఏదో ఒక రూపంలో తీసుకోవాలి

ముందడుగు ప్రత్యేకం : మనిషి నిత్యం ఆరోగ్యంగా ఉండాలంటే విటమిన్లు, ఖనిజాలు చాలా అవసరం. మనం తినే ఆహారం ద్వారా వీటిని పొందాలి. విటమిన్లు మాత్రమే మనల్ని ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉంచుతాయి. శరీరంలో కణాలు, కణజాలాల ఏర్పాటులో సహాయపడుతాయి. రక్తంలో ఆర్‌బిసి, డిఎన్‌ఎలను తయారు చేయడంలో విటమిన్ కూడా సహాయపడుతుంది. ఎముకల పటిష్టమైనా, కండరాల ఆరోగ్యమైనా ప్రతి పనికి విటమిన్లు అవసరం. మొత్తం 13 విటమిన్లు ఉన్నప్పటికీ, శరీరంలో తగినంతగా ఉండడానికి అవసరమైన 7 ముఖ్యమైన విటమిన్ల గురించి ఇప్పుడు చూద్దాం.

### ఈ 7 ముఖ్యమైన విటమిన్లు చాలా అవసరం

**1. విటమిన్ A :**
సాధారణంగా విటమిన్ A కంటి చూపును మెరుగుపరుస్తుందని అనుకుంటారు. మీరు కూడా అలా అనుకుంటే పొరబడినట్టే. హార్వర్డ్ మెడికల్ హెల్త్ ప్రకారం.. చర్మం, ఎముకల బలానికి విటమిన్ ఏ కూడా చాలా ముఖ్యమైనది. విటమిన్ ఏ రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది, అంటే, ఇది ఇన్ఫెక్షన్ల నుండి కూడా రక్షిస్తుంది. విటమిన్ ఏగా మార్చబడిన లైకోపీన్ వినియోగం ప్రోస్టేట్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. కంటిశుక్లం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. విటమిన్ ఏ కోసం పాల ఉత్పత్తులు, మాంసం, చిలగడదుంపలు, క్యారెట్లు, గుమ్మడికాయ, బచ్చలికూర, మామిడి వంటివి తీసుకోవాలి.

**2. విటమిన్ B1**
దీనిని థయామిన్ అని కూడా అంటారు. ఈ విటమిన్ ఆహారాన్ని మీ శరీరంలో శక్తిగా మారుస్తుంది. చర్మం, జుట్టు, కండరాలు, మెదడు ఆరోగ్యానికి ఇది చాలా అవసరం. నరాలకు ప్రాణం పోయడానికి కూడా విటమిన్ బి1 అవసరం. విటమిన్ B1 కోసం బ్రౌన్ రైస్, సోయామిల్క్, పుచ్చకాయ, స్వీట్ కార్న్ మొదలైన వాటిని తినండి.

**3. విటమిన్ B3**
విటమిన్ బి3 కూడా ఆహారాన్ని శక్తిగా మారుస్తుంది. దీంతో పాటు రక్తం ఏర్పడటానికి, మెదడు, నాడీ వ్యవస్థకు ఇది చాలా ముఖ్యం. విటమిన్ B3 మాంసం పౌల్ట్రీ, తృణధాన్యాలు, పుట్టగొడుగులు, బంగాళదుంపలు, వేరుశెనగ వెన్న మొదలైన వాటిలో లభిస్తుంది.

**4. విటమిన్ B6**
విటమిన్ B6 మనకు చాలా ముఖ్యమైనది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. విటమిన్ B6 ట్రిప్టోఫాన్‌ను నియాసిన్‌గా మారుస్తుంది, ఇది న్యూరోట్రాన్స్‌మిటర్‌ను ఆరోగ్యవంతంగా చేస్తుంది. న్యూరోట్రాన్స్మిటర్లు ఆరోగ్యంగా ఉంటే, నిద్ర మంచిది, ఆకలి పెరుగుతుంది. మానసిక స్థితి మెరుగ్గా ఉంటుంది. విటమిన్ B6 కోసం మాంసం, చేపలు, బంగాళాదుంపలు, టోఫు, చిక్కుళ్ళు, తాజా పండ్లు, అరటిపండు, పుచ్చకాయ మొదలైనవి తినండి.

**5. విటమిన్ బి12**
విటమిన్ బి12 చాలా ముఖ్యమైన విటమిన్. ఇది రక్తంలో హోమియోసిస్టీన్ స్థాయిని తగ్గిస్తుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. విటమిన్ B12 కొత్త కణాలను ఏర్పరచడంలో సహాయపడుతుంది. శరీరానికి ఉపయోగపడే కొవ్వు ఆమ్లాలు, అమైనో ఆమ్లాలను విచ్ఛిన్నం చేస్తుంది. విటమిన్ బి12 నాడీ కణాలను రక్షిస్తుంది. అంటే నరాలు ఆరోగ్యంగా ఉండాలంటే కూడా ఇది అవసరం. విటమిన్ B6 మాంసం, పౌల్ట్రీ, చేపలు, పాలు, బలవర్ధకమైన తృణధాన్యాలు మరియు సోయామిల్క్ నుండి పొందవచ్చు.

6. ఇన్ఫెక్షన్ నుండి రక్షించడానికి విటమిన్ సి చాలా ముఖ్యం. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. విటమిన్ సి కంటిశుక్లం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. విటమిన్ సి చర్మం కింద కొల్లాజెన్‌ను నిర్మిస్తుంది, ఇది చర్మాన్ని మృదువుగా చేస్తుంది. ఇది కాకుండా అనేక రకాల పనులకు విటమిన్ సి అవసరం. విటమిన్ సి కోసం సిట్రస్ పండ్లు, బ్రోకలీ, టొమాటో, స్ట్రాబెర్రీ, బచ్చలికూర, క్యాప్సికమ్ మొదలైన వాటిని తినండి.

**7. విటమిన్ D-**
విటమిన్ D వల్ల మాత్రమే శరీరంలో కాల్షియం గ్రహించబడుతుంది. ఇది రక్తంలో కాల్షియం, భాస్వరం సమతుల్యం చేస్తుంది. ఎముకల దృఢత్వానికి విటమిన్ డి కూడా చాలా ముఖ్యం. విటమిన్ డి.. కొవ్వు చేపలు, బలవర్ధకమైన పాలు, తృణధాన్యాలు నుండి పొందవచ్చు. అయినప్పటికీ విటమిన్ డి అతిపెద్ద మూలం సూర్యకాంతి.

ముందడుగు
మంగళవారం, 02-7-2024, హైదరాబాద్



టెక్ ఫర్ ఇండియా 2025 ఫెలోషిప్ ప్రోగ్రామ్ కోసం

# దరఖాస్తులు ఆహ్వానం

ముందడుగు హైదరాబాద్:
బాలలకు సమాన విద్యా అవకాశాల కోసం పని చేస్తున్న ఒక సంస్థ టీచ్ ఫర్ ఇండియా, తన 2025 ఫెలోషిప్ కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ సెప్టెంబరు 1, 2024.
టీచ్ ఫర్ ఇండియా ఫెలోషిప్ అనేది రెండేళ్ల, పూర్తి-సమయం చెల్లింపు ఫెలోషిప్ ప్రోగ్రామ్. ఇది ఉద్వేగభరితమైన వ్యక్తులను విద్యా రంగంలో నాయకులుగా, మార్పు తీసుకువచ్చే వారిలా మారడానికి సాధికారత ఇస్తుంది. కాగా, 640 మంది సభ్యులు 2024 కోహోర్ట్‌లో చేరగా, ఎడ్-ఈక్విటీ ఉద్యమంలో ప్రోగ్రామ్‌కు పెరుగుతున్న ప్రభావం మరియు ప్రేరేపణకు ఇది బలమైన రుజువుగా మారింది. ఫెలోషిప్ దరఖాస్తు ప్రక్రియ అత్యంత ప్రత్యేకంగా, భారతదేశంలో ఉజ్వల మరియు అత్యంత ఆశాజనకంగా ఉన్న వ్యక్తుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తుంది. ఎంపికైన వారికి కఠినమైన శిక్షణా కార్యక్రమాలు ఉంటాయి. అక్కడ వారు విద్యా వ్యవస్థను దాని అట్టడుగు స్థాయి నుంచి అర్థం చేసుకునేలా ప్రేరేపణ అందుకుంటూ, సవాళ్లను ఎదుర్కొంటారు. టీచ్ ఫర్ ఇండియా ఫెలోషిప్ మరియు ఎంపిక ప్రక్రియ గురించి మరింత తెలుసుకోవడానికి దయచేసి క్రింది లింక్‌లను సందర్శించండి:
Apply For the Teach For India Fellowship 2025 | How To Be a Fellow

## ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవ ప్రత్యేకం

ముందడుగు హైదరాబాద్:
టెక్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు సాధికారత కల్పించేందుకు కట్టుబడిన మెటా, భారతదేశంలోని టెక్ఎం ఎస్ఎంఈలు ఏఐను అలవర్చుకునే ప్రయాణపు ప్రస్తుత స్థితిని గుర్తించేందుకు నాస్కామ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవం సందర్భంగా, మెటా మద్దతుతో నాస్కామ్, 'ఎంపవర్లింగ్ ఇండియాస్ గ్రోత్: టెక్-ఎనేబుల్డ్ ఎంఎస్ఎంఈలకు ఏఐ సామర్థాలను అన్‌లాక్ చేయడం" అనే శీర్షికతో ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. ఇది టెక్ ఎంఎస్ఎంఈలకు తమ వ్యాపార కార్యకలాపాలలో ఏఐని స్వీకరించడంలో టెక్ ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న కీలక అవకాశాలు మరియు సవాళ్లను పరిశోధించింది. నాస్కామ్ సీనియర్ ఉపాధ్యక్షురాలు మరియు చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ సంగీతా గుప్తా మాట్లాడుతూ, "భారత ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఎంఎస్ఎంఈలు నేటి వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్ ల్యాండ్‌స్కేప్‌లో కీలకమైన దశలో ఉన్నాయి. ఏఐని ఏకీకృతం చేయడం వలన వారికి అపూర్వమైన వృద్ధి, పెరిగిన ఉత్పాదకత మరియు స్థిరమైన ఆవిష్కరణలకు ఒక ప్రత్యేక అవకాశం లభిస్తుంది. కస్టమర్-ఫ్రెండ్లీ సాధనాలు, వనరుల అందుబాటుతో పాటు పర్యావరణ వ్యవస్థ సహకారం, ఏఐ పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకునేందుకు, మరియు భారతదేశం తన ఏఐ డివిడెండ్‌లను పెంచుకునేందుకు సాంకేతికతతో నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈలకు అవసరం" అని తెలిపారు.

# జైల్లో ఉన్న రషీద్ ప్రమాణస్వీకారానికి అనుమతి

## సమ్మతి తెలిపిన జాతీయ దర్యాప్తు సంస్థ



ముందడుగు ఢిల్లీ:
లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన ఉగ్రనిధుల కేసు నిందితుడు ఇంజినీర్ రషీద్ ఎంపీగా ప్రమాణస్వీకారం చేసేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సమ్మతి తెలియజేసింది. దీనిపై ఢిల్లీ హైకోర్టు తుది ఆదేశాలు వెలువరించాల్సి ఉంది. జమ్మూకశ్మీర్‌కు చెందిన షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజినీర్ రషీద్ బారాముల్లా నియోజవర్గం నుంచి లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్రుడిగా పోటీ చేసి, విజయం సాధించారు. నేషనల్ కాన్ఫరెన్స్ నేత, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాపై 2లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలకు నిధులు సమకూర్చారన్న అభియోగాలపై 2019 ఆగస్టులో అరెస్టయ్యారు. ప్రస్తుతం అతడు జైల్లో ఉండటంతో మిగతావారితో పాటు 18వ లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణం చేయలేపోయారు. పంజాబ్‌లోని ఖడూర్ సాహిబ్ స్థానం నుంచి వేర్పాటువాది అమృత్‌పాల్ సింగ్ గెలుపొందిన సంగతి తెలిసిందే. అతడు కూడా ఇంకా ప్రమాణ స్వీకారం చేయలేదు. అతడు కూడా జైల్లోనే ఉన్నాడు.



# దళపతితో వన్స్‌మోర్

తమిళ సినీరంగంలో దళపతి విజయ్-సమంత జోడీని హిట్ పెయిర్‌గా అభివర్ణిస్తారు. వీరిద్దరూ కలిసి నటించిన మూడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సాధించాయి. దీంతో ఈ జంట వెండితెరపై మరోమారు సందడి చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విజయ్ 69వ చిత్రంలో సమంత కథానాయికగా ఖరారైందని తమిళ ఫిల్మ్ సర్కిల్స్‌లో ప్రచారం జరుగుతున్నది. దళపతి విజయ్ రాజకీయ అరంగేట్రానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. తన చివరి చిత్రంగా 'విజయ్ 69'కు సన్నాహాలు చేస్తున్నారు. పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తారు. డీవీవీ దానయ్య నిర్మాత. ఇందులో విజయ్ యువ రాజకీయ నాయకుడిగా కనిపిస్తారని అంటున్నారు. ఈ చిత్రంలో కథానాయికగా సమంత దాదాపుగా ఖరారైందని, త్వరలో అధికారిక ప్రకటన వెలువడుతుందని సమాచారం. ప్రస్తుతం సమంత స్వీయ నిర్మాణ సంస్థలో 'మా ఇంటి బంగారం' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నది.

## వైజాగ్ వారియర్స్ టైటిల్ స్పాన్సర్ గా ఫన్88 న్యూస్ ఒప్పందం

ముందడుగు హైదరాబాద్ :
ఆంధ్రా ప్రీమియర్ లీగ్ యొక్క ప్రస్తుత సీజన్ కోసం తమ అధికారిక టైటిల్ స్పాన్సర్‌గా ఫన్88 న్యూస్‌తో హైదరాబాద్ కు చెందిన లైఫ్‌స్పాన్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క సహ యాజమాన్య వైజాగ్ వారియర్స్ జట్టు తమ స్పాన్సర్‌షిప్ ఒప్పందాన్ని ప్రకటించింది. లైఫ్‌స్పాన్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు మరియు వైజాగ్ వారియర్స్ జట్టు సహ యజమాని డాక్టర్ నరేంద్ర రామ్ చేసిన ఈ ప్రకటన, ఎపిఎల్-2024 కోసం సన్నద్ధమవుతున్న జట్టుకు ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది.

వైజాగ్ వారియర్స్ జట్టు బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా చేత గుర్తించబడిన ఎపిఎల్ లోని అగ్ర పోటీ జట్లలో ఒకటి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ద్వారా 2022లో ఎపిఎల్ లో అడుగు పెట్టినప్పటినుంచి ఆంధ్రప్రదేశ్‌లో క్రికెట్‌ను ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తోంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) లేదా జాతీయ జట్టుకు చేరుకునే సామర్థ్యంతో ఆటగాళ్లకు తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి వేదికను అందించడంతోపాటు యువ ప్రతిభను పెంపొందించడం ఈ లీగ్ యొక్క లక్ష్యం.

# 500కోట్ల క్లబ్‌లో కల్కి



బాక్సాఫీస్ బరిలో 'కల్కి' జైత్రయాత్ర కొనసాగుతున్నది. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. నాలుగు రోజుల్లోనే ఈ సినిమా రికార్డు స్థాయిలో 555 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ అధికారికంగా ప్రకటించింది. హిందీ బెల్ట్‌లో ఈ చిత్రం నాలుగు రోజుల్లో 115 కోట్ల కలెక్షన్స్ సాధించడం విశేషం. ఇక విదేశాల్లో కూడా 'కల్కి' వసూళ్లపరంగా సంచలనాలను సృష్టిస్తున్నది. ఉత్తర అమెరికాలో తొలి వారాంతంలోనే 11 మిలియన్ డాలర్ల కలెక్షన్స్ (90.2 కోట్లు) రాబట్టిన మొదటి భారతీయ చిత్రంగా అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఉన్న ట్రెండ్స్ ప్రకారం అతిత్వరలో ఈ సినిమా వెయ్యి కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.